క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమాలు



ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవేడులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం విశేష హోమాలు నిర్వహించారు. సాయంత్రం క్షీరాధివాసం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

పరామర్శ



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నాటి ప్రభాకర్‌రెడ్డి సతీమణి అనురాధ ఉత్తరక్రియల్లో ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనురాధ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వర్‌గుప్తా, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, నాయకులు రాజారామిరెడ్డి, ఎల్‌సీ కొండారెడ్డి, దేగా వంశీ, ఎం తిరుపతినాయుడు, ఎం సిద్దయ్య, కొండారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రేవునూరి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పురస్కారంపై లభించడంపై హర్షం



ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ పురస్కారం అందుకోవడంపై కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కేక్ కట్ చేశారు. అనంతరం చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, కమిషనర్ సీ గంగా ప్రసాద్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించి అభినందించారు. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు, కౌన్సిలర్ల సహకారంతోనే స్వచ్ఛపురస్కారాన్ని అందుకున్నట్లుగా కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్లు సూరా భాస్కర్ రెడ్డి, పొడమేకల పెంచలయ్య, రాజశేఖర్, మహబూబ్‌బాషా, రమాదేవి, శివకోటారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద కులవివక్ష పోరాట సమితి 27వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా నాయకులు నాగయ్య నేతృత్వంలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ దళితులపై దాడులను ఖండించారు. దళితులపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కేవీపీఎస్ కార్యవర్గ సభ్యులు ఎం నాగేంద్ర, మహేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అడవి బాపిరాజుకు నివాళి



కావలి(అల్లూరు): పట్టణంలోని వెంగళరావునగర్‌లోని గ్రంథాలయంలో సమరయోధుడు, రచయిత, కళాకారుడు అడవి బాపిరాజు జయంతిని గురువారం నిర్వహించారు. బాపిరాజు చిత్రపటానికి గ్రంథాలయాధికారిణి బొమ్మల కోటేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్రీడలతో మానసికోల్లాసం



సోమశిల: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని మండల స్కూల్ గేమ్స్ కోఆర్డినేటర్ సూర గౌరిరెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరంలోని టీజేఎస్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలను ఎంఈఓ పద్మనాభంతో కలిసి ఆమె బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. తొలిరోజు అండర్-14,17 విభాగాల్లో అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాతృవందనం కోసం ఎదురుచూపులు

- ఆరోగ్యకర ప్రసవాల ప్రోత్సాహానికి కేంద్రం అమలు
- వైద్యారోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్‌కు పథకం బదిలీ
- గర్భిణులు, బాలింతల నమోదులో జాప్యం
- ఏడాదిగా లబ్ధిదారులకు అందని నగదు



గర్భిణికి సీమంతం చేస్తున్న దృశ్యం(ఫైల్)

దుత్తలూరు: ఆరోగ్యకర ప్రసవాలను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై)ను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు గర్భందాల్చిన సమయంలో పోషకాహారం, మందుల కోసం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అయితే గతేడాదిగా ఈ పథకం అమలు కావడం లేదు. వైద్యారోగ్య శాఖ పరిధిలో ఉన్న పథకాన్ని ఐసీడీఎస్‌కు అప్పగించడంతో లబ్ధిదారుల నమోదులో జాప్యం జరుగుతోంది. మరోవైపు పథకం కింద నమోదు చేసుకున్న జిల్లాలోని గర్భిణులు, బాలింతలు నగదు కోసం ఎదురు చూస్తున్నారు.

ఇదీ పథకం ముఖ్య ఉద్దేశం

పేద మహిళలు గర్భం దాల్చిన సమయంలో, బిడ్డకు జన్మనిచ్చిన తరువాత పోషకాహారం, మందులు, తదితర ఖర్చులకు ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం పీఎంఎంవీవై పథకం కింద నగదు సాయం అందజేస్తోంది. ఈ పథకం కింద మొదటి కాన్పులో తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.5వేల నగదును జమచేస్తోంది. గర్భిణిగా నమోదు చేసుకున్న సమయంలో రూ.వేయి, బిడ్డ పుట్టినప్పుడు రూ.2 వేలు, బిడ్డకు టీకాలు వేయించే సమయంలో మరో రూ.2 వేలు చొప్పున జమచేస్తారు. అలాగే రెండో కాన్పులో ఆడబిడ్డ పుడితే మరో రూ.6 వేలు అందజేస్తోంది.

దరఖాస్తు ఇలా..

మాతృ వందన యోజన కింద లబ్ది పొందేందుకు లబ్ధిదారుల వయస్సు 19 ఏళ్లు ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల కంటే తక్కువ ఉండాలి. ప్రభుత్వం మంజూరు చేసిన బీపీఎల్ కార్డు, ఉపాధి హామీ పథకం, ఈశ్రమ్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్డుల్లో ఏదోకటి కలిగి ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబాల వారు ఈ పథకానికి అనర్హులు. అర్హత కలిగిన గర్భిణులు సమీప అంగన్‌వాడీ కేంద్రం, ఆశావర్కర్‌ను సంప్రదించాలి. ఆధార్ కార్డు, గర్భధారణ ధ్రువీకరణ పత్రం, పిల్లల జనన ధ్రువీకరణ పత్రం, పోస్టాఫీస్, బ్యాంక్ ఖాతా వివరాలు సమర్పించాలి.

సమన్వయ లోపంతో..

కేంద్ర ప్రభుత్వ పీఎంఎంవీవై పథకాన్ని గతంలో వైద్యారోగ్య శాఖ నిర్వహించేది. ఈ పథకాన్ని ఏడాదిన్నర క్రితం ఐసీడీఎస్ శాఖకు అప్పగించారు. అప్పట్నుంచి రెండు శాఖల మధ్యన సమన్వయ లోపంతో పథకం అమలు కావడం లేదు. గర్భిణులు, నవజాత శిశువుల నమోదు జరగడం లేదు. జిల్లాలోని లబ్ధిదారుల ఖాతాల్లో 2024 మధ్య కాలం వరకు నగదు జమైంది. ఆ తర్వాత నుంచి నగదు జమకావడం లేదు. జిల్లా పరిధిలో సుమారు తొమ్మిది వేల మందికి పైగా గర్భిణులు రిజిస్ట్రేషన్ చేయించుకుని నగదు కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఐసీడీఎస్ పరిధిలో మరి కొంతమంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

లాగిన్లు అందజేస్తున్నాం

గత ఏప్రిల్ నుంచి పీఎంఎంవీవై పథకాన్ని వైద్యఆరోగ్య శాఖ నుంచి ఐసీడీఎస్‌కు బదిలీ చేశారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు లాగిన్లు అందజేస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ చేపట్టి నగదు జమచేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– హేనాసుజన్, పీడీ, ఐసీడీఎస్, నెల్లూరు



ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పోస్టర్

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.315 ధర లభించింది. వేలానికి 914 బేళ్లు రాగా, 654 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.315, కనిష్ఠంగా రూ.70, సగటున రూ.177.08 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వేడుకలు

ఆత్మకూరురూరల్: కరటంపాడు పంచాయతీ పరిధిలోని సాతానుపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రథమ వార్షిక వేడుకలను గురువారం నుంచి శనివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 9న ఉదయం శ్రీవారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ, సాయంత్రం పల్లకిసేవ, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 10న ఉదయం అష్టోత్తర పూజ, కుంకుమార్చన, సాయంత్రం పల్లకిసేవ, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. 11న ఉదయం సుప్రభాతసేవ, అష్టోత్తర పూజ, కల్యాణోత్సవం, సాయంత్రం 4 గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 9, 10 తేదీల్లో రాత్రి పూట, 11న ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పార్టీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

దగదర్తి: కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మనుబోలుపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులను బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నించే వారిపైన అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు ప్రజలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చిందన్నారు. డిజిటల్ బుక్‌లో కూటమి నాయకుల వల్ల జరిగిన అన్యాయాన్ని పొందుపరిస్తే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు కలవకూరు శ్రీనివాసులురెడ్డి ఇంటికి వెళ్లి ఇటీవల వివాహం చేసుకున్న కుమార్తె, అల్లుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వెలినేని మహేష్‌నాయుడు, మండల ఉపాధ్యక్షులు చింతలబోయిన వెంకటేశ్వర్లు, తాళ్లూరు రాజశేఖర్, యువత అధ్యక్షుడు వట్టికాళ్ల మాధవరావు, నాయకులు కలవకూరు శ్రీనివాసులురెడ్డి, చేజర్ల మోహన్‌రెడ్డి, వెలం సుబ్బారావు, ఆత్మకూరు గిరినాయుడు, భీమిరెడ్డి మధురెడ్డి, బొడ్డు భాస్కర్‌రెడ్డి, కోట రాఘవరెడ్డి, కోట రాధారెడ్డి, పల్లవరం సురేంద్ర, జొన్న చలపతి, అల్లం శ్రీనివాసులు, దారా విజయకుమార్, షేక్ లతీఫ్, రమణయ్య, గద్దగుంట మాధవ,,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డీడీయూజీకేవైను సద్వినియోగం చేసుకోవాలి



ఉదయగిరి రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన(డీడీయూజీకేవై)ను గ్రామీణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆ పథకం కోఆర్డినేటర్స్ ఎస్‌కే హనీఫా, ఎస్ స్పందన కోరారు. బుధవారం వారు విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ టీ వెంకటేశ్వర్లును కలిసి పథకం బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పథకం కింద ఇంటర్మీడియట్, ఐటీఐ ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మూడు నెలల పాటు ఉచితంగా నైపుణ్యశిక్షణను అందించనున్నట్లు తెలిపారు. శిక్షణా సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా స్టడీ మెటీరియల్, ప్రాక్టికల్ కిట్లు, యూనిఫామ్ అందజేస్తామని చెప్పారు. శిక్షణానంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.వివరాలకు 91772 55671, 70939 63089 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పెరిగిన ఆధార్ సేవల రుసుం



సీతారామపురం : ఆధార్ సేవల రుసుమును యుఐడీఏఐ స్వల్పంగా పెంచింది. ఈ నెల ఒకటి నుంచి 2028 సెప్టెంబర్ 30 తేదీ వరకు పెంచిన చార్జీలు అమల్లో ఉండనున్నాయి. జిల్లాలో నిత్యం పది వేల మందికి పైగా ఆధార్ సేవలు పొందుతున్నారు. ఐదేళ్లకు పైబడిన వారిలో ఆధార్ నవీకరణ చేయించుకోవాల్సిన వారు వేల సంఖ్యలోనే ఉన్నారు. వారందరినీ ఆధార్ కేంద్రాల బాట పట్టించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్ సేవలను ఉచితంగా అందించనున్నారు. ఏడేళ్ల పైబడిన వారికి వేలిముద్రలను నవీకరించుకునేందుకు నిన్న మొన్నటి వరకు రూ.100 రుసుం ఉండగా ఇప్పుడు రూ.125కు పెంచారు. చిరునామా మార్పునకు చెల్లించాల్సిన రూ.50 రుసుమును రూ.75కు పెంచారు. ఆధార్ కార్డు కలర్ ప్రింట్ ఏ-4 సైజులో ఇవ్వడానికి గతంలో రూ.20 ఉండగా ఇప్పుడు రూ.40 చేశారు.

మేకపాటిని కలిసిన సతీష్‌రెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిని మేకపాటి శాలువాతో సన్మానించారు. అనంతరం ఇరువురు ఉదయగిరిలోని రాజకీయ పరిస్థితులపై చర్చించుకున్నారు. అనంతరం వరికుంటపాడు మండలం ఆండ్రవారిపల్లిలో నూతనంగా నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నాగార్పమ్మ గుడిని సందర్శించారు. స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఆయన వెంట నాయకులు షేక్ అలీఅహ్మద్, ఆండ్రా తేజారెడ్డి, ఆండ్రా అనంతరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ



ఆత్మకూరు: పట్టణంలోని చెరువు సమీపంలో నిర్మిస్తున్న పాండురంగస్వామి ఆలయానికి డాక్టర్ దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్ మైక్‌సెట్‌ను బహూకరించారు. బుధవారం ఆలయ ట్రస్ట్ సభ్యులకు మైక్‌సెట్‌ను అందజేశారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్, ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, పీ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ2.0పై అవగాహన



ఆత్మకూరు: పట్టణంలోని ఎస్సార్‌జేడీ కళాశాలలోని విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0పై బుధవారం అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి ప్రస్తుతం అమల్లో ఉన్న జీఎస్టీ, నూతన జీఎస్టీ 2.0లోని స్లాబ్‌లను పోల్చి అన్ని వర్గాల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూరనున్న ప్రయోజనాలను వివరించారు. అనంతరం మిషన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, డిజిటల్ ఇండియా, వికసిత్ భారత్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జీ వరకుమారి, అధ్యాపకులు అంకమ్మ, సుప్రియ, డాక్టర్ ప్రసాద్, రేణుక, వెంకట్, ఎల్లయ్య, విజయకుమారి, రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



ఉదయగిరి రూరల్: మండలంలోని జీ అయ్యవారిపల్లి, దేకూరుపల్లి, కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ టీ వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసన, పఠనా సామర్థ్యాలను పరీక్షించి అసెస్మెంట్ బుక్‌లెట్లను పరిశీలించారు. అసెస్మెంట్ బుక్‌లెట్లను ఎప్పటికప్పుడు దిద్ది మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పాఠశాల అనంతరం స్టడీఅవర్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎంలు బాబు, విజయ్‌కుమార్, లత ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



ఉదయగిరిరూరల్ : దుర్గంపల్లెలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు



సోమశిల: అనంతసాగరం మండలం యాకర్లపాడు పాఠశాలలో..



మర్రిపాడు: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఎస్‌ఓ రవీంద్రబాబు

ఉదయగిరి రూరల్: వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యతని ఎఫ్‌ఎస్‌ఓ చిన్నవెంకటయ్య పేర్కొన్నారు. దుర్గంపల్లెలో బుధవారం నిర్వహించిన వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమన్నారు. అడవులను కాపాడుకుంటే సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో పల్లెలు పచ్చగా ఉంటాయన్నారు. జీవ సమతుల్యత దెబ్బ తినకుండా వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థి స్థాయి నుంచే విద్యార్థులు అడవులు, వణ్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎఫ్‌బీఓలు బీ వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం యాకర్లపాడు పాఠశాలలో ఆత్మకూరు అటవీశాఖ సెక్షన్ అధికారి టీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులతో పాటు గ్రామస్తులకు అటవీసంపద, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు.జీవకోటి మనుగడకు ఆధారమైన అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వన్యప్రాణాలకు హాని కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతసాగరం సెక్షన్ బీట్ ఆఫీసర్లు శ్రీనివాసులు, చెంచురాములు, ప్రసాద్‌బాబు, చెక్‌పోస్టు సిబంది పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మర్రిపాడు అటవీ సెక్షన్ అధికారి కే రవీంద్రబాబు ఆధ్వర్యంలో అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జీ శ్రీనివాసులు, ఎఫ్‌బీలు పరబ్రహ్మం, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఓటరు జాబితా తయారీకి సహకరించాలి



మాట్లాడుతున్న మురళి

ఉదయగిరి: స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి బీఎల్వోలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఉదయగిరి నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఏ మురళి కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎనిమిది మండలాల తహసీల్దార్లతో ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు, పోలింగ్ స్టేషన్లు, తదితర అంశాలపై చర్చించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించాలన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 3,27,297 లక్షల మంది జనాభా ఉండగా, 2,41,742 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. 323 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓ ఎల్ రామ్మోహన్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ నీహా, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అనుమసముద్రంపేట: అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు



కలిగిరి మండలం వెలగపాడులో అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ విజయలక్ష్మి

అనుమసముద్రంపేట: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, కస్తూరి పేర్కొన్నారు. అనుమసముద్రం, పందిపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని, బిడ్డ పుట్టిన అరగంటలో ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయని తెలిపారు. అంగన్‌వాడీలు కే ప్రసన్న, సీహెచ్ రూతమ్మ, పీ పుష్పకళ, ఎస్‌కే జరీనతాజ్, వీ నవనీత, పీ పద్మావతి, ఎం రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: మండలంలోని వెలగపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్థూలకాయాన్ని నివారించేందుకు చక్కెర, నూనెల వినియోగాన్ని తగ్గించాలన్నారు. బాల్యదశ సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, చిన్నారుల ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు ఖాదరున్నీసా, లక్ష్మి, రాగమయి, ముంతాజ్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: మండలంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ బుధవారం తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.